క్లుప్తంగా

ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీగా లక్ష్మీపతి



ప్రత్తిపాడు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) ఇంజినీరింగ్ కన్సల్టెంట్ (ఈసీ)గా ఆముదాలపల్లి లక్ష్మీపతి స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. పెదనందిపాడు మండలం ఇన్‌చార్జి ఏపీవో, రెగ్యులర్ ఈసీగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన్ను ప్రత్తిపాడు మండలానికి ఇన్‌చార్జి ఈసీగా నియమిస్తూ ఆశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన బాధ్యతలు చేపట్టారు.

కిట్స్ కళాశాలకు ఏఐసీటీఈ నుంచి నగదు బహుమతి



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ కళాశాలకు ఏఐసీటీఈ నగదు బహుమతిని అందజేసింది. కళాశాలలో ఈ నెల 20న ఏఐసీటీఈ, స్పైసెస్ స్కీమ్స్ సౌజన్యంతో ఆవిష్కార క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఐడియాథాన్, వర్క్‌షాప్ ఆన్ ఆపర్చ్యునిటీస్ ఆన్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్, ప్రాజెక్టు ఎగ్జిబిషన్, పోస్టర్ ప్రజెంటేషన్‌లను అద్భుతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐసీటీఈ కళాశాలకు లక్ష రూపాయల నగదు బహుమతిని అందించింది. చెక్కును కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ శేఖర్ శనివారం ఆవిష్కార క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. రాధాకృష్ణన్‌కు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె. హరిబాబు తదితరులు పాల్గొని, రాధాకృష్ణన్‌కు అభినందనలు తెలిపారు.

సేద్యపు నీటి కుంటలపై దృష్టి సారించాలి

ప్రత్తిపాడు: ఉపాధి హామీ పథకం కింద రైతులు పొలాల్లో సేద్యపు నీటి కుంటల్ని ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఏపీవో షేక్ మస్తాన్‌వలి తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రత్తిపాడు, కొండేపాడు, కోయవారిపాలెం, కొత్తమల్లాయపాలెం, పాతమల్లాయపాలెం, తిక్కిరెడ్డిపాలెం, నిమ్మగడ్డవారిపాలెం గ్రామాలకు చెందిన ఉపాధిహామీ మేట్లకు శిక్షణ ఇచ్చారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ సర్వర్‌లో చేసిన మార్పులు, మొబైల్ ద్వారా హాజరు తీసుకునే విధానం, హాజరైన కూలీల వివరాలను మస్టర్‌లో నమోదు చేసే ప్రక్రియ, నూతన పనులను గుర్తించే విధానం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీవో మస్తాన్‌వలి మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకానికి వీలుగా ప్రభుత్వం సేద్యపు నీటి కుంటలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. గతంలో నిర్మించిన మినీ గోకులాల మాదిరిగా గేదెల షెడ్లు నిర్మించుకునేందుకు ఉపాధిహామీ పథకంలో అవకాశం ఉందన్న విషయాన్ని పాడి రైతులకు తెలియజేయాలని చెప్పారు. మినీ అమృత్ సరోవర్ కింద రక్షిత మంచినీటి చెరువులను అభివృద్ధి పరచాలని సూచించారు.

ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు



పెదకాకాని: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి, ఉన్నతాధికారుల చేతుల మీదుగా పెదకాకాని మండలంలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులు అవార్డులు అందుకున్నారు. రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా గుంటూరు పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో అవార్డులు అందుకున్న వారిలో పెదకాకాని పోలీసుస్టేషన్ ఎస్‌ఐ వినోద్‌బాబు, గ్రంథాలయాధికారి వేముల విజయకుమార్, పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట్ గుడిపాటి వెంకటరమణారావు ఉన్నారు. అవార్డులు అందుకున్న అధికారుల్ని శనివారం కార్యాలయ సిబ్బంది అభినందించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కొండపాటూరు(కాకుమాను): మండలంలోని కొండపాటూరు ప్రీ హైస్కూలులో మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఎంఈవో కెఎఫ్.కెనడీ తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రతిరోజు నాణ్యమైన భోజనాన్ని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం సూచించిన మెనూను తప్పక పాటించాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శీలం అంకారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘ఆసరా’తో అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధి

వారోత్సవాల్లో ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పొదుపు సంఘాల మహిళలతో సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: అక్కచెల్లెమ్మలను లక్షాధికారుల్ని చేసేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఆసరా పథకాన్ని గత ఐదేళ్లుగా అమలు చేస్తున్నారని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. ఆసరా వారోత్సవాల్లో భాగంగా శనివారం నల్లపాడులో రూరల్ మండలం పొదుపు సంఘాల మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త బలసాని మాట్లాడుతూ మహిళలకు ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా జగనన్న ఆసరా ఐదవ విడత అందించినట్లు చెప్పారు. జగనన్న మాట ఇచ్చారంటే చేసి తీరుతారన్నారు. అన్నట్టే చెప్పిన మాటను చేసి చూపే ఏకైక నాయకుడు మన జగనన్న అని తెలిపారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాల్ని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ పథకాల ద్వారా మళ్లీ ఊపిరి పోశారని తెలిపారు. మహిళలకు సంక్షేమ పథకాలతో వారి కుటుంబాలకు పెద్దదిక్కుగా మారారని చెప్పారు. వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి వంటి పథకాల ద్వారా ప్రతి ఇంటికీ సుమారు రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూర్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఆసరా లబ్ధిదారులతో బలసాని స్వయంగా మాట్లాడారు. జిల్లాలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా 2.86 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు రూ 987.06 కోట్ల రూపాయల లబ్ధి చేకూరిందని తెలిపారు. రూరల్ మండలంలో 648 స్వయం సహాయక సంఘాలకు 4వ విడత రూ 4,60,07,701 చెక్కులను అందజేశారు. స్త్రీనిధి ద్వారా 699 సంఘ సభ్యులకు 2023–24 సంవత్సరానికి రూ 3,77,20,000 చెక్కును అందజేశారు. త్వరలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా ఇచ్చిన పట్టాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నారని తెలిపారు. ఈ రిజిస్ట్రేషన్లన్నీ మహిళల పేరు మీదే జరుగుతాయని, ఇక మన ఆడబిడ్డలంతా సొంతింటి యజమానులు కాబోతున్నారని చెప్పారు. దీంతో ఆ ప్రాంతమంతా హర్షధ్వానాలతో మార్మోగింది. అనంతరం పొదుపు సంఘాల మహిళలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తామంతా జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి పద్మావతి, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, ఆళ్ళ రవిదేవరాజు, వైస్ ఎంపీపీ దర్శి సుజాత, సర్పంచులు ఆరుదల సాంబశివరావు, దొడ్డా సామ్రాజ్యం, మబ్బు శిరీష, డబ్బూరి సూర్యప్రకాశరావు, ఏరువ జగన్‌మోహన్‌రెడ్డి, ఇంటూరి అంజిరెడ్డి, కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి, మిర్చి యార్డ్ డైరెక్టర్ ఇంద్ర, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, మెట్టు వెంకటప్పారెడ్డి, నూనె ఉమామహేశ్వర్‌రెడ్డి, దుగ్గెంపూడి బాలఅంజిరెడ్డి, తంగెళ్ల నాగేశ్వరరావు, దుంపాల రాధ, దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, దగ్గుల మల్లికార్జునరెడ్డి, ఏటుకూరి విజయసారథి, దుగ్గెంపూడి భూపాల్‌రెడ్డి, ఎంపీడీవో ఆదినారాయణ, ఈవో పీఆర్‌డీ శ్రీనివాసరావు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్లతో విద్యార్థుల్లో సృజనాత్మకతకు ప్రోత్సాహం



సైన్స్ ఎగ్జిబిషన్ ముగింపు సందర్భంగా శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న రెవరెండ్ సిస్టర్ సంధ్యారాణి

పెదకాకాని: విద్యా సంస్థల్లో సైన్స్ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతకు ప్రోత్సాహం లభిస్తుందని నెక్స్ట్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ కోగంటి శ్రీకాంత్ అన్నారు. పెదకాకాని సెయింట్ జోసప్ సీబీఎస్ఈ పాఠశాలలో రెండు రోజుల ఇన్‌వెంటర్స్ ఓయాసిస్ పేరిట నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కోగంటి శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఎగ్జిబిషన్లు అద్భుతమైన వేదికని తెలిపారు. ప్రతి సబ్జెక్ట్‌లోనూ ఆర్ట్ ఇంటిగ్రేషన్ ఉందని, భావ వ్యక్తీకరణకు అవకాశం ఉండేలా ఎగ్జిబిషన్ రూపొందించడం అభినందనీయమని తెలిపారు. ఎగ్జిబిషన్‌లో చక్కని ప్రతిభ చూపిన విద్యార్థుల్ని ప్రోత్సహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ రెజీనామేరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు పాఠశాల ఆవరణలో చక్కని కళాకృతులు, చిత్రాలు ప్రదర్శించారు. ఆటల్లో ప్రతిభ చూపిన విద్యార్థుల్ని ఉపాధ్యాయులు అభినందించారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

- టీడీపీ విమర్శలపై ప్రతిదాడి
- సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం

పొన్నూరు: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికలకు సిద్ధమయ్యారు. చిన్న చిన్న మనస్పర్థల కారణంగా కొన్ని నెలలుగా దూరంగా ఉంటున్న పార్టీ శ్రేణులు ఏకమై రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని విజయ ఢంకా మోగించే విధంగా సమాయత్తమవుతున్నారు. నియోజకవర్గంలో టీడీపీ చేస్తున్న అసత్య ప్రచారాలకు చరమగీతం పాడేందుకు 300 మందికి పైగా నియోజకవర్గ స్థాయి నాయకులు శుక్రవారం పొన్నూరు పట్టణంలో సమావేశమయ్యారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు పాటుపడతామని నాయకులు, కార్యకర్తలంతా స్పష్టం చేశారు. ఇటీవల టీడీపీ ముసుగులో ఉండి, స్వార్థ ప్రయోజనాల కోసం వైఎస్సార్ సీపీలో కొనసాగుతున్న వారు ఒకరిద్దరు పార్టీని వీడారు. ఈ విషయాన్ని టీడీపీ రాజకీయ ప్రచారంగా వినియోగించుకుంటోంది. దీంతో నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను పసిగట్టిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించారు.రానున్న ఎన్నికలలో టీడీపీ, జనసేనలను చిత్తుచిత్తుగా ఓడిస్తామని నేతలు తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ జెడ్పీటీసీ, రాష్ట్ర కాపునాడు వర్కింగ్ ప్రెసిడెంట్ కోట శ్రీనివాసరావు,నన్నపనేని అంకినీడు చౌదరి, వడ్రాణం ప్రసాదరావు, షేక్ సఫాయితుల్లా, అనిల్ కుమార్, మురళీకృష్ణ, ఉస్మాన్ మేస్త్రి, ప్రేమ్ కుమార్, మహేష్ పాల్ పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీకి జాతీయ స్థాయిలో పలు అవార్డులు



అవార్డులను ప్రదర్శిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఐఐటీ మద్రాస్, ఎన్‌పీటీఈఎల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయిలో అవార్డుల పంటను పండించారని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు కనబరిచిన ప్రతిభకు జాతీయ స్థాయిలో ఏఏ రేటింగ్, ఎన్‌పీటీఈఎల్ స్టార్స్, డొమైన్ స్కాలర్ అవార్డులు సాధించడం తమ కళాశాలకెంతో గర్వకారణమని పేర్కొన్నారు. అవార్డుల్ని ఇటీవల ఐఐటీ మద్రాస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వి.పి. చంద్రశేఖరరావు అవార్డుల్ని అందుకున్నట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్, పాలక మండలి సభ్యులు మాట్లాడుతూ అన్ని ఎన్‌పీటీఈఎల్ చాప్టర్స్‌లో తమ కళాశాల అత్యుత్తమ స్థానంలో నిలవడం సంతోషకరమని తెలిపారు. 2017 నుంచి ఇప్పటి వరకు మూడు సార్లు ఏఏఏ రేటింగ్, 10వ సారి ఏఏ రేటింగ్‌ను కళాశాల సాధించిందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నం

వేజండ్ల(చేబ్రోలు): మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చేబ్రోలు మండలం వేజండ్లలో శనివారం జరిగింది. దళితవాడకు చెందిన వేజండ్ల కరుణమ్మ కొద్ది రోజులుగా కుటుంబ సమస్యలతో సతమతమవుతోంది. శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. బంధువులు గమనించి 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఉల్లాసంగా ‘ఆడుదాం ఆంధ్రా’ పోటీలు



కబడ్డీ బాలుర విభాగంలో విజేతగా నిలిచిన పెదనందిపాడు టీం



కబడ్డీ బాలికల విభాగంలో విజేతగా నిలిచిన గుంటూరురూరల్ టీం

ప్రత్తిపాడు: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుగుతున్నాయి. క్రీడాకారులు హోరాహోరీగా పోటీల్లో తలబడుతున్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన బాలుర కబడ్డీ పోటీల్లో పెదనందిపాడు టీం విజేతగా, ప్రత్తిపాడు టీం రన్నర్‌గా నిలిచింది. బాలికల విభాగంలో గుంటూరు రూరల్ మండలం టీం విన్నర్‌గా, ప్రత్తిపాడు రన్నర్‌గా నిలిచింది. గొట్టిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో మూడవ ప్లేస్‌కు జరిగిన బ్యాచ్‌లో వట్టిచెరుకూరు టీం విన్నర్‌గా, సెమీఫైనల్స్‌కు జరిగిన మ్యాచ్‌లో గుంటూరు రూరల్ టీం విజేతగా నిలిచింది.

నూర్‌బాషా దూదేకులకు ప్రాతినిధ్యం కల్పించాలి



మౌన దీక్ష చేస్తున్న నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు

గుంటూరు రూరల్: స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకూ నూర్‌బాషా దూదేకుల నుంచి ఒక్క ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ కానీ లేకపోవడం ఆవేదనకు గురి చేస్తోందని నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. పీర్‌మహమ్మద్ తెలిపారు. నగరంలోని లాడ్జి సెంటర్ దగ్గరున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నోటికి నల్లబ్యాడ్జీలు కట్టుకుని మౌన దీక్షను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు, మూడు లక్షల మంది జనాభా ఉన్న కులాలకు చెందిన వారు సైతం చట్టసభలు, శాసన మండలి, పార్లమెంటులో అడుగు పెడుతున్నారని తెలిపారు. 23 లక్షలకు పైగా జనాభా ఉన్న నూర్‌బాషా దూదేకులకు రాజకీయ పార్టీలు అవకాశాన్ని ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. చట్ట సభల్లో ప్రవేశించని ఏ కులమైనా అంతరించిపోయినట్టేనని అంబేడ్కర్ అన్నారని గుర్తు చేశారు. అన్ని కులాలకు వర్తించే సామాజిక న్యాయం నూర్‌బాషా దూదేకులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం సలహాదారు డాక్టర్ బాబన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, కోశాధికారి పర్ల దస్తగిరి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ డి. మస్తానమ్మ, ఉద్యోగ విభాగం అధ్యక్షుడు పి. సిద్దయ్య, యువజన విభాగం అధ్యక్షుడు డి. పెద్దమస్తాన్, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి నాగూర్, జిల్లా అధ్యక్షుడు కె. ఖాజావలి, నగర అధ్యక్షుడు ఆదాంషఫీ, 26 జిల్లాల నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి బజరంగ్ త్రిచక్ర వాహనం అందజేత



రత్నానికి వాహనాన్ని అందజేస్తున్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: పేద దివ్యాంగునికి బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం త్రిచక్ర వాహనాన్ని అందజేశారు. జగన్నామ సంక్షేమ సంగమం కార్యక్రమంలో భాగంగా ఇటీవల బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేబ్రోలు మండలం నారాకోడూరులో నేత్ర జ్యోతి, మీ గుండె పదిలం, దివ్యాంగ దర్శిని తదితర కార్యక్రమాల్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన దివ్యాంగుడైన మంచాల రత్నం నడవలేని స్థితిలో పడుతున్న ఇబ్బందులను అంబటి మురళీకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన నారాకోడూరులోని రత్నం ఇంటి వద్దకు వెళ్లి ట్రై సైకిలును అందజేశారు. రత్నం దైనందిన కార్యక్రమాలు నిర్వహించడానికి వెస్టన్ కమోడ్‌ను కూడా సమకూర్చారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను స్ఫూర్తిగా తీసుకుని బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల పరంపరను కొనసాగిస్తున్నట్లు అంబటి మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

గుండె సర్జరీ చేయించుకున్న మహిళకు పరామర్శ

మీ గుండె పదిలం కార్యక్రమంలో అత్యవసర గుండె సర్జరీగా నిర్ధారించటంతో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ మెడ్‌స్టార్ హాస్పిటల్‌లో సర్జరీ పూర్తి చేసుకున్న కొల్లా సరస్వతిని అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. నేత్ర జ్యోతి వైద్య శిబిరంలో కళ్లజోళ్లు పొందిన స్థానికులు ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో స్థానికులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

కోయవారిపాలెం (ప్రత్తిపాడు): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేశారు. ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెంలో రామినేని శ్యాంబాబు అక్రమంగా మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నాడన్న సమాచారం పోలీసులకు శనివారం అందింది. దీంతో హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు అతడ్ని అదుపులోకి తీసుకుని, ఐదు మద్యం సీసాల్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

మహిళా విద్యే దేశానికి శ్రీరామరక్ష



గుంటూరు ఎడ్యుకేషన్: మహిళా విద్య దేశానికి శ్రీరామరక్ష అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి పేర్కొన్నారు. అనవేమా ట్రస్టు ఆధ్వర్యంలో స్తంభాల గరువులోని ఉడుముల కోటిరత్నం–సాంబిరెడ్డి బాలికల హాస్టల్‌లో శనివారం దాతల సహకారంతో ఉపకార రూ.10 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. 50 మంది విద్యార్థినులకు ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున రూ.ఐదు లక్షలతో పాటు బండి సాహితీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 10 మంది విద్యార్థినులకు రూ.50 వేలు చొప్పున మరో రూ.ఐదు లక్షలు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మాట్లాడుతూ ఏ సమాజమైనా సామాజిక, రాజకీయ అభివృద్ధి చెందాలంటే పురుషులతో పాటు మహిళలు సైతం విద్యావంతులుగా ఎదగడం తప్పనిసరని తెలిపారు. ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థినులు దాతల సహకారాన్ని మరువకుండా అనుకున్న లక్ష్యాల్ని చేరుకుని, తిరిగి వారు సైతం దాతలుగా మారాలని కోరారు. 15 ఏళ్లుగా ట్రస్ట్ ద్వారా బాలికల హాస్టల్ నడుపుతూ వందలాదిమందికి ఉచిత భోజన, వసతి సదుపాయాలతో పాటు ఉపకార వేతనాలు అందించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం ఆమెను అనవేమా ట్రస్ట్ బాలికల వసతి గృహ కమిటీ సభ్యులు, బండి సాహితీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఇంటి ఆడపడుచుగా భావించి గంధం, పసుపుకుంకుమలు, నూతన వస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో 31వ డివిజన్ కార్పొరేటర్ ఉడుముల లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, దుంప రవీంద్రారెడ్డి, సృజన, ఆవుల సాంబిరెడ్డి, హైకోర్టు న్యాయవాది మార్రెళ్ల రాధా, బండి అశోక్ రెడ్డి, వసతి గృహ అధ్యక్షుడు ఉడుముల శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి వణుకూరి సూరారెడ్డి పాల్గొన్నారు.

క్రెడాయ్ ప్రాపర్టీ షోకు అనూహ్య స్పందన



విజేతకు స్మార్ట్ టీవీ అందజేస్తున్న ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మామిడి రాము తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యంలో రింగ్‌రోడ్డులోని సిద్ధార్థ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోకు అనూహ్య స్పందన లభిస్తోందని ఆంధ్రప్రదేశ్ క్రెడాయ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి పేర్కొన్నారు. శనివారం క్రెడాయ్ ప్రాపర్టీ‌లో భాగంగా లక్కీ డ్రాలో విజేతలుగా నిలిచిన నెహ్రూనగర్‌కు చెందిన వి.ఎస్.ప్రసాద్‌కు స్మార్ట్ టీవీని ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం అందజేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ కొనుగోలు దారులకు సచ్చే విధంగా నాణ్యమైన నిర్మాణంతో క్రెడాయ్ వెంచర్లు, ఫ్లాట్లను అందరికీ అందుబాటులో ధరల్లో అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ఎమ్మెల్సీ ఏసురత్నం మాట్లాడుతూ అమ్మకందారులకు, కొనుగోలుదారులకు చక్కటి వేదికను క్రెడాయ్ ఏర్పాటు చేసిందన్నారు. క్రెడాయ్ ఏపీ అధ్యక్షుడు వై.వి.రమణారావు, ప్రధాన కార్యదర్శి బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రాపర్టీ షోలో ప్రతి రోజూ 10 మంది విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రెడాయ్ గుంటూరు చాప్టర్ అధ్యక్షుడు మామిడి రాము, ఉపాధ్యక్షుడు మెట్టు సాంబశివారెడ్డి, కార్యదర్శి తియ్యగూర వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.